నవోదయ ప్రవేశ పరీక్షకు 82శాతం హాజరు

కలెక్టరేట్, జనవరి 20: కిల్తంపాలెం జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశానికి శనివారం చేపట్టిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి జిల్లాలో జరిగిన పరీక్షకు 7630 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 6271 మంది రాశారు. 82శాతం హాజరు నమోదైంది. 40 కేంద్రాల్లో ఈ పరీక్ష ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకూ జరిగింది. కిల్తంపాలెం నవోదయ పాఠశాలలో మొత్తం 80 సీట్లు ఉండగా 6271 మంది ప్రవేశ పరీక్ష రాశారు. అంటే ఓకే సీటుకు 78 మంది విద్యార్థులు పోటీ పడ్డారు.

సమ్మె ఉధృతం

- జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీల రాస్తారోకోలు, ర్యాలీలు
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

బెలగాం/సాలూరు/గుమ్మలక్ష్మీపురం/పాలకొండ/కురుపాం, జనవరి 20: అంగన్‌వాడీల సమ్మె తీవ్రరూపం దాల్చింది. గత 40 రోజులుగా తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో శనివారం ఉదయం జిల్లాలో పలుచోట్ల రాస్తారోకోలు, మానవహారాలు చేపట్టారు. తమ సమస్యలను పరిష్కరించాలని పెద్దఎత్తున నినాదాలతో హోరెత్తించారు. వేతనాలు పెంచే వరకు పోరాటాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. ఇకనైనా బెదిరింపులు మానుకుని తమ సమస్యలను పరిష్కరించాలని, లేదంటే పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు సీఐటీయూ, ఏఐటీయూ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వ చర్యలతో కోనసీమ జిల్లా పెద్దపేట గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త కొత్తపల్లి శాంతికుమారి మృతి చెందిందని, ఆమె కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. ఎస్మా చట్టం ప్రయోగించి, నోటీసులు ఇచ్చి తమను భయందోళనకు గురి చేయడం ప్రభుత్వానికి తగదన్నారు. తెలంగాణ కంటే రూ.వెయ్యి ఎక్కువ వేతనం ఇస్తామని సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదని తేల్చి చెప్పారు. వేతనం పెంచాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు సాలూరు గౌరీమణి, మజ్రాపు అలివేలు, జి.జ్యోతి, సీఐటీయూ నాయకులు జి.వెంకటరమణ, పాకల సన్యాసిరావు, ఏఐటీయూసీ నాయకులు దామోదర్, జి.సూరయ్య తదితరులు పాల్గొన్నారు. సాలూరులో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బోసుబొమ్మ కూడలి వరకు ర్యాలీగా వెళ్లి జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అంగన్‌వాడీ నాయకులు నారాయణమ్మ, శశికళ మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించే వరకూ ఎన్ని ఆటంకాలు వచ్చినా ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. అంగన్‌వాడీల చేస్తున్న న్యాయ పోరాటంపై ప్రభుత్వం స్పందించాలని ట్రైబుల్ రైట్స్ ఫోరం రాష్త్ర అధ్యక్షుడు రొబ్బ లోవరాజు డిమాండ్ చేశారు. గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ, మానవహారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు, మండల అధ్యక్షుడు పువ్వల ప్రసాద్ సంఘీభావం తెలిపారు. పాలకొండ డివిజన్ కేంద్రంలో సీఐటీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు పాల్గొన్నారు. కురుపాం బస్టాండ్ వద్ద అంగన్‌వాడీలు రాస్తారోకో నిర్వహించి నిరసన తెలియజేశారు. సీపీఎం నాయకులు ఎం.కృష్ణమూర్తి, కొల్లి గంగునాయుడు పాల్గొన్నారు.



సాలూరు:జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న అంగన్‌వాడీలు


కురుపాం: రాస్తారోకో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు


గుమ్మలక్ష్మీపురం: మానవహారంగా అంగన్‌వాడీలు


బెలగాం: నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు



పాలకొండ: రాస్తారోకో చేస్తున్న దృశ్యం

నాగావళి తీర ప్రజలకు గండం


గోపాలపురం వద్ద నదిలో అడ్డంగా దారి ఏర్పాటు చేసిన దృశ్యం

- మారుతున్న నదీ ప్రవాహ దిశ
- నాగావళిలో అడ్డంగా రోడ్డు
- గోపాలపురం, బొడ్డవలస వద్ద భారీగా అనధికార తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు

రేగిడి, జనవరి 20: నాగావళి నదిలో అనధికార క్వారీలతో భవిష్యత్‌లో పెద్ద గండమే పొంచి ఉంది. తీర ప్రాంతాల ముంపు సమస్య తీవ్రం కానుంది. తవ్వకాలతో ఇప్పటికే నది ప్రవాహ దిశ మారుతోంది. వరదలొచ్చినప్పుడు తీర గ్రామాలను ముంచే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. మరోవైపు ఏడు మండలాలకు రక్షిత నీరు ఇస్తున్న నదిలోని ఊటబావులకూ ముప్పు కలగవచ్చు. ఈ పరిస్థితి ఎక్కడో కాదు. విజయనగరం జిల్లా, మన్యం జిల్లా సరిహద్దు గ్రామాలైన రేగిడి మండలం బొడ్డవలస, పాలకొండ మండలం గోపాలపురం వద్దే. అక్కడ నాగావళి నది రూపురేఖలు మారిపోతున్నాయి. పెద్ద ప్రమాదాన్ని హెచ్చరిస్తున్నాయి. ఒకప్పుడు నదీప్రవాహంతో తీర గ్రామాలకు ఎలాంటి ఇబ్బందీ ఉండేది కాదు. నాగావళి నుంచి ఇసుక సేకరించదలిచినా.. నదిలోకి దిగాలన్నా.. భయం కలిగేది కాదు. ఇప్పుడు ఎక్కడ గుంత ఉందో తెలియదు. అది ఎంత లోతు ఉంటుందో అంచనా వేయలేం. రేగిడి మండలంలో ఆవలి ఉన్న గోపాలపురం ఒడ్డు, ఇవతలున్న బొడ్డవలస ఒడ్డున క్వారీలు యథేచ్ఛగా వెలుస్తున్నాయి. ఒకరిని చూసి ఒకరు తవ్వకాలకు దిగుతున్నారు. గోపాలపురం వద్ద నదీలోకి అడ్డుగా రోడ్డు వేసేశారు. దీంతో ప్రవాహ దిశ మారుతోంది. ఇటు బొడ్డవలస గ్రామానికీ పెద్ద ముప్పు తప్పదంటున్నారు. ఇక్కడ రక్షితబావులు, భారీ వంతెన ఉండటంతో ఈప్రాంతం క్వారీలకు నిషేధం. కానీ నిబంధనలను లెక్కచేయడం లేదు. రాజకీయ నాయకులు వెనకుండి సహకారం అందిస్తుండడంతో అధికారులు ఏమీ చేయలేకపోతున్నారు. రేగిడి మండలంలో ఉన్న 12 లోతట్టు గ్రామాల్లో బొడ్డవలస ఒకటి కాగా వర్షాకాలంలో ఈగ్రామం పట్ల జిల్లాయంత్రాంగం అప్రమత్తంగా ఉంటుంది. నది ఒడ్డున ఉండడంతో వరదల కాలంలో గ్రామాన్ని ఖాళీ చేయించి సమీప పంచాయతీ సంకిలిలో వసతి సమకూర్చిన రోజులున్నా యి. తర్వాతతర్వాత నదీప్రవాహం ఎప్పుడూ మధ్యలోనే ఉండటంతో ఇంతవరకు ఎటువంటి ఇబ్బంది లేదు. అయితే అనధికార క్వారీలతో ఈప్రాంతంలో పెద్దగుంతలు ఏర్పడుతున్నాయి. గోపాలపురం వైపు నది వెళ్లకుండా ప్రత్యేకంగా దారి ఏర్పాటు చేసి నదీ ప్రవాహ దిశను మార్చేశారు. ఇది రానున్న వరద సీజన్‌లో ఎలాంటి ప్రమాదాన్ని తెచ్చిపెడుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు క్వారీలకు అతిదగ్గరలోనే పాలకొండ- విశాఖ వెళ్లే ప్రధాన వంతెన మార్గం ఉంది. ఇది బలహీనమైతే పరిస్థితి ఏంటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.


బొడ్డవలస వద్ద అధికంగా చేరిన నీరు

ప్రయాణికుల కష్టాలు

- బస్సులు లేక, రైళ్ల రద్దుతో ఇబ్బందులు
- ప్రయాణాలను రద్దు చేసుకుంటున్న వైనం
- అదనపు సర్వీసులు నడపాలని వినతి

పార్వతీపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి సొంతూళ్లకు వచ్చిన వారికి తిరుగు ప్రయాణంలో తిప్పలు తప్పడం లేదు. రద్దీకి తగ్గట్టుగా ఆర్టీసీ అధికారులు సరిపడా బస్సులు నడపకపోవడం, సకాలంలో అవి రాకపోవడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. పోని రైళ్లలో వెళ్దామంటే అవి రద్దయ్యాయి. దీంతో కొందరు తమ ప్రయాణాలను వాయిదా వేసుకుంటున్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రం పార్వతీపురం నుంచి విశాఖపట్నం, విజయ నగరం, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సులు పూర్తిస్థాయిలో లేవు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తుంది. పార్వతీపురం నుంచి పాలకొండకు వెళ్లేందుకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు లేక సాధారణ బస్సుల్లో ప్రయాణించాల్సి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. పండగ వెళ్లిన తర్వాత ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని బస్సుల సంఖ్యను పెంచాల్సిన అధికారులు కనీసం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరోపక్క పలు రైళ్ల రద్దుతో ప్రయాణికులకు మరిన్ని ఇబ్బందులు తప్పలేదు. పార్వతీపురం మీదుగా ఒడిశా నుంచి విశాఖపట్నం వెళ్లే రైళ్లు, విశాఖపట్నం నుంచి పార్వతీపురం మీదుగా ఒడిశా తదితర ప్రాంతాలకు వెళ్లే రైళ్లలో కొన్ని రద్దు అయ్యాయి. దీంతో పలువురు తమ ప్రయాణాలను వాయిదా వేసుకున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి వివిధ ప్రాంతాలకు అదనంగా బస్సులు నడపాలని జిల్లావాసులు కోరుతున్నారు.


పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో శనివారం బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

భక్తుల పాట్లు

ఉత్తరాంధ్ర కల్పవల్లి శంబర పోలమాంబ అమ్మవారి జాతర సోమవారం నుంచి ప్రారంభంకానుంది. ఈ జాతరకు కోసం ఇప్పటికే పెద్దసంఖ్యలో భక్తులు శంబరకు తరలి వస్తున్నారు. అయితే, జిల్లా కేంద్రం పార్వతీపురం నుంచి శంబరకు వెళ్లేందుకు తగినన్ని బస్సులు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా అధిక చార్జీలను వసూలు చేస్తూ ప్రైవేట్ వాహనదారులు ప్రయాణికులను దోచుకుంటున్నారు.

చంద్రబాబును కలిసిన జిల్లా నాయకులు



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నిమ్మక జయకృష్ణ, తోయక జగదీశ్వరి, గుమ్మిడి సంధ్యారాణి, బోనెల విజయచంద్ర, బాబుకు నమస్కరిస్తున్న జగదీష్, చిరంజీవులు

పార్వతీపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అరకులో శని వారం జరిగిన రా..కదలిరా కార్యక్రమంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును జిల్లా నాయకులు కలిశారు. చంద్రబాబుకు స్వాగతం పలికి సన్మానించారు. అధినేతను కలిసిన వారిలో సాలూరు, పాలకొండ, కురుపాం, పార్వతీపురం నియోజకవర్గాల ఇన్‌చార్జిలు గుమ్మిడి సంధ్యారాణి, నిమ్మక జయకృష్ణ, తోయక జగదీశ్వరి, బోనెల విజయచంద్ర ఉన్నారు. మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యేలు బొబ్బిలి చిరంజీవులు, ఆర్‌పీ భంజ్‌దేవ్, . పార్వతీపురం నియోజకవర్గ పరిశీలకుడు గోవిందరాజులుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, టీడీపీ అనుబంధ సంఘాల ప్రతినిధులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ కౌన్సిలర్లు రా..కదలిరా కార్యక్రమానికి హాజరయ్యారు.

రేపటి నుంచి శంబర జాతర

- శరవేగంగా ఏర్పాట్లు
- చదురు, వనంగుడిల వద్ద ప్రత్యేక క్యూలైన్లు
- పరిశీలించిన ఏఎస్పీ

మక్కువ, జనవరి 20: శంబర పోలమాంబ అమ్మవారి జాతర సోమవారం నుంచి జరగనుంది. మూడు రోజుల పాటు జరిగే ఈ జాతర కోసం ఆలయ అధికారులు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. చదురుగుడి, వనంగుడిల వద్ద ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. కేశఖండన శాలలు, ప్రసాద విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. చదురుగుడి, వనంగుడిల వద్ద విద్యుత్తు దీపాలంకరణ పనులు చేపడుతున్నారు. ఇప్పటికే ప్రసాదాల తయారీ ప్రారంభమైంది. సుదూర ప్రాంతాల నుంచి ఇప్పటికే భక్తులు తరలివస్తుండడంతో గ్రామంలో సందడి నెలకొంది. మక్కువ-బొబ్బిలి, మక్కువ-చినభోగిలి ప్రధాన రహదారులకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. శంబర గ్రామంలో శనివారం పారిశుధ్య పనులను చేపట్టారు. వ్యర్థాలను డంపింగ్ కేంద్రాలకు తరలించారు. సీసీ కెమెరాల ఏర్పాటు మొదలైంది. జాతరలో విధుల నిర్వహణకు గాను దేవదాయశాఖ సిబ్బంది 100 మందిని వినియోగిస్తున్నట్లు ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు. 70వేల లడ్డూలను తయారు చేశామని, తాత్కాలిక మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వృద్ధులు, చిన్నారులకు ప్రత్యేక దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జాతర ఏర్పాట్లను పార్వతీపురం ఏఎస్పీ సునీల్ సొరెన్ శనివారం పరిశీలించారు. పార్కింగ్ ప్రదేశాలు, క్యూలైన్లు ఏర్పాట్లు తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జాతరలో పోలీసు బందోబస్తు ఏర్పాట్ల వివరాలపై సీఐ ధనుంజయరావును ఆరా తీశారు. ఎస్‌ఐ నరసింహమూర్తి పాల్గొన్నారు.


భక్తుల కోసం ఏర్పాటు చేస్తున్న క్యూలైన్లు


శంబర పోలమాంబ అమ్మవారు

ప్రయాణం సురక్షితం.. సుఖప్రదం కావాలి

- కలెక్టర్ నిశాంత్‌కుమార్
- రహదారి భద్రతా మాసోత్సవాలు ప్రారంభం

పార్వతీపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రయాణం సురక్షితం.. సుఖ ప్రదం కావాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అన్నారు. శనివారం రహదారి భద్రతా మాసోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తన కార్యాలయంలో భద్రతా మాసోత్సవాల కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. ఫిబ్రవరి 19 వరకు ఈ మాసోత్సవాలు జరుగుతాయని చెప్పారు. వాహనచోదకులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, కుటుంబాన్ని, ఆత్మీయులను గుర్తు పెట్టుకోవాలని, డ్రైవింగ్ చేసేటప్పుడు పూర్తి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా రవాణాధికారి సి.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ.. మాసోత్సవాల్లో భాగంగా ఈ నెల 22న రహదారి భద్రతపై పార్వతీపురం, సాలూరు, పాలకొండల్లో వలంటీర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 23, 24 తేదీల్లో రహదారులపై ఉన్న బ్లాక్ స్పాట్‌లపై పార్వతీపురంలో చర్చిస్తామన్నారు. 25, 27 తేదీల్లో సాలూరు, పాలకొండల్లో ప్రజా ప్రతినిధులు, వలంటీర్లతో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 29న పార్వతీపురంలో డ్రైవర్లకు ఆరోగ్య, నేత్ర పరీక్షలు, 30, 31 తేదీల్లో పార్వతీపురం, సాలూరు, పాలకొండల్లో విద్యా సంస్థల నిర్వాహకులు, స్కూల్ బస్సు డ్రైవర్లు, సరుకు రవాణా డ్రైవర్లకు అవగాహన సదస్సులు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.శశికుమార్, పాలనాధికారి జి.సీతారాం, సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎస్.రమేష్‌కుమార్, జి.సత్యనారాయణ, ఎ.వరప్రసాద్, బి.కాశీరామ్‌నాయక్, వైద్యాధికారి పి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు విడుదల చేస్తున్న కలెక్టర్

దళిత ద్రోహి జగన్

● టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రావాడ సీతారాం



మాట్లాడుతున్న సీతారాం

రాజాం: సీఎం జగన్ దళిత ద్రోహి అని టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రావాడ సీతారాం ఆరోపించారు. శనివారం రాజాంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులపై దాడులు, హత్యాయత్నాలు చేపట్టడమే కాకుండా వార్ని అన్ని రంగాల్లో ఇబ్బందులకు గురి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అంబేడ్కర్ విగ్రహావిష్కరణ ఎలా చేశారని ప్రశ్నించారు. ఐదేళ్లుగా బెయిల్ రాకుండా జైలులో మగ్గిపోతున్న దళిత యువకుడు కోడి కత్తి శ్రీనుకు, వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. ఐదేళ్ల పాలనలో దళితులను తీవ్ర సంక్షోభంలోకి నెట్టారనిమండిపడ్డారు. రాజ్యాంగబద్ధంగా అమలు కావాలిసిన 27 సంక్షేమ పథకాలను రద్దుచేసి దళితులకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు దళితుల మెప్పు పొందడానికి మాత్రమే అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నల్ల మోహన్‌రావు, గట్ట రాచంద్రుడు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర నుంచే ఎన్నికల శంఖారావం

విజయనగరం (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికలకు సంబంధించి ఉత్తరాంధ్ర నుంచే సీఎం జగన్ శంఖారావం చేస్తారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శనివారం జడ్పీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 27న భీమిలి దగ్గర భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసి ఎన్నికలకు సన్నద్ధం చేస్తారని తెలిపారు.

ట్రైసైకిళ్ల పంపిణీ

రేగిడి: మండలంలోని సంకిలి ఈఐడీప్యారీ సుగర్స్ ఆర్థిక సాయంతో హెల్పేజ్‌ఇండియా భాగస్వామ్యంతో వృద్ధులు, దివ్యాంగులకు పరికరాలు అందజేశారు. కంపెనీ సీఎస్ఆర్ నిధులతో ట్రైసైకిళ్లు, చేతికర్రలు, కామోడ్ బేసిన్స్, వాకర్లు తదితర 50 పరికరాలు శనివారం సంకిలిలో సర్పంచ్ బి.పట్టాభి అధ్యక్షతన ఐడీప్యారీ సీనియర్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ పట్టాభి రామిరెడ్డి, హెచ్ఆర్ హెడ్ మురళీకృష్ణ అందజేశారు. సంకిలి మాజీ సర్పంచ్ ఆర్. కృష్ణారావు, హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్ గణపతి, వంశి, సీహెచ్ గణపతి, శ్రీకాంత్, ధర్మాన రాములు పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ కోర్సులో శిక్షణ

బొబ్బిలి: బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రికల్ టెక్నీషియన్ కోర్సులో స్వల్పకాలిక శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రవికుమార్ తెలిపారు. 18 నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగి... పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఈ కోర్సులకు అర్హులని అన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 22న విద్యార్హతలు, ఆధార్, ఫొటోలు, కుల ధ్రువీకరణ పత్రాలతో ఐటీఐలో హాజరు కావాలని ఎంపీడీవో ఒక ప్రకటనలో తెలిపారు.

శోభాయాత్రను జయప్రదం చేయండి

రాజాం: రాజాంలోని ఠాణా వీధి విష్ణుకోవెల నుంచి అమ్మవారి కాలనీలో రామమందిరం వరకు సోమవారం అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ పురస్కరించుకుని నిర్వహించనున్న శోభాయాత్రను జయప్రదం చేయాలని వైష్ణవ ఆచార్య పీఠాధిపతి రంగనాథం పిలుపునిచ్చారు. శనివారం రాజాం కోదండ రామాలయంలో శోభాయాత్ర పోస్టర్‌ను ఆవిష్క రించారు. హిందూ ధార్మిక సంస్థల ప్రతి నిధు లు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, ఉమాపతి శేషు గు రుస్వామి, కొవ్వాడ అప్పలనాయుడు, శెట్టి శ్రీనివాసరావు, మహంతి సత్యానారాయణ, వాకచర్ల పైడిరాజు, ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్, అర్చకులు రామకృష్ణ పాల్గొన్నారు.

రేపు సామూహిక రామనామ సంకీర్తన

విజయనగరం రింగు రోడ్డు: ఈ నెల 22న అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం రామనారాయణంలో సామూహిక రామనామ సంకీర్తనలు ఏర్పాటు చేసినట్టు ఎన్‌సీఎస్ ట్రస్టు సభ్యులు నారాయణం శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 22న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకూ సామూహిక రామ నామ సంకీర్తనా కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. సాయంత్రం ప్రత్యేకంగా దీపోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. అయోధ్యలో జరుగుతున్న బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని తిలకించేందుకు ఎల్ఈడీ స్క్రీన్స్ ఏర్పాటు చేశామని, భక్తులంతా రామనారాయణం ప్రాంగణానికి చేరుకొని... వేడుకను వీక్షించవచ్చని తెలిపారు.

రేపు రామభజన

బొబ్బిలి, జనవరి 20: అయోధ్యలో శ్రీరామ మందిర ప్రతిష్ఠోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం బొబ్బిలి చినబజారు రామ మందిరంలో రామ భజన నిర్వహించనున్నట్లు శ్రీ వాసవీ కళింగ వైశ్య సంఘ అధ్యక్షుడు గెంబలి హరిరామశంకరరావు తెలిపారు. ఉదయం 8 నుంచి రామభజన, సాయంత్రం 5 గంటల నుంచి పట్టణంలో స్వామివారి తిరువీధులు నిర్వహిస్తామన్నారు. బొబ్బిలి పట్టణంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9.30 గంటలకు జై శ్రీరామ్ రథ యాత్ర పేరిట బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు పెంట స్వామినాయుడు, చెలికాని కేశవ తెలిపారు.

కుల గణన సర్వే

రామభద్రపురం: మండలంలోని 19 సచివాలయాల పరిధిలో కుల గణన సర్వే కొనసాగుతోంది. రామభద్రపురం పరిధిలో సచివాలయం-2లో ఎంపీడీవో రమామణి పర్యవేక్షించారు. 10 రోజుల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీసిబ్బంది రవి, శ్రావణి పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు కోరుకొండ విద్యార్థి

బొబ్బిలి: కోరుకొండ సైనిక్ స్కూలు విద్యార్థి, బొబ్బిలికి చెందిన కన్నూరు రెణిత్ శ్రీవాత్సవ యోగా నంద నాయుడు ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికయ్యాడు. ఎన్‌సీసీ కేడెట్‌గా నేవీ విభాగంలో గణ తంత్ర వేడుకల్లో పాల్గొనబోతున్నాడు. ఆ విద్యార్థిని మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు, టీడీపీ నియో జకవర్గ ఇన్‌చార్జి బేబీనాయన అభినందించారు.

శ్రీరాముని జాతరకు బందోబస్తు

కొత్తవలస: కొత్తవలస శ్రీరాముల వారి తీర్థానికి సంబంధించి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని సీఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. శనివారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ, తెలుగుదేశం పార్టీ నాయకుల మధ్య గొడవలు జరగకుండా ముందస్తుగానే ఫ్లెక్సీలు ఏర్పాటు విషయమై స్థలాలు కేటాయించామని చెప్పారు.

పేదల అభ్యున్నతే టీడీపీ లక్ష్యం

● అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలు అమలు

● అదితి గజపతిరాజు



నగరంలోని 2, 3, 4 డివిజన్లలో టీడీపీ గ్యారెంటీలను ప్రజలకు వివరిస్తున్న అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, జనవరి 20: పేదల అభ్యున్నతే లక్ష్యంగా టీడీపీ పనిచేస్తోందని విజయనగరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు చెప్పారు. టీడీపీ రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం 2, 3, 4 డివిజన్లల్లో 'బాబు భరోసా.. భవిష్యత్తుకి గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నాయకులు ప్రసాదుల ప్రసాద్, కిల్లాన మహేష్, వెలిచేటి మణికుమారి, బాబురావు, కిల్లాన పార్వతీ, రొబ్బి వీరలక్ష్మి, గండ్రేటి సన్యాసిరావు అదితి గజపతిరాజుకి ఘన స్వాగతం పలికారు. మూడు డివిజన్ల పరిధిలో ఇంటింటికీ వెళ్లి మహానాడు వేదికగా చంద్రబాబు ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, టీడీపీ అధికా రంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలను అమలు చేయడం ద్వారా రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు కృషి జరుగుతుందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ఆధ్వర్యంలోనే అది సాధ్యమన్నారు.

● జిల్లా నందమూరి అభిమాన సంఘం ప్రతినిధులతో శనివారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో అదితి గజపతిరాజు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నందమూరి అభిమాన సంఘం గౌరవ అధ్యక్షుడు ఐవీపీ రాజు, కనకల మురళీమోహన్ ఆధ్వర్యంలో నందమూరి అభిమానులంతా ఆమెతో కలిసి గంటసేపు మాట్లాడారు. ఈ సందర్భంగా అదితికి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నందమూరి అభిమానులంతా మునుపటి కంటే ఉత్సాహంగా రానున్న ఎన్నికల్లో పనిచేయాలన్నారు. పార్టీ నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని పార్టీ నాయకులు నందమూరి అభిమానులకు అందించే విధంగా చర్యలు చేపడతామన్నారు. టీడీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఆమె నందమూరి అభిమానులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నందమూరి అభిమాన సంఘం ప్రతినిధులు కాగిత శ్రీని వాస్ యాదవ్, కనకల మన్మధ, బంటుపల్లి రమేష్, రమణ, దువ్వ రాము, గుడ్డాల పాపారావు, దుర్గాప్రసాద్, నర్సింగ్, రామారావు, అప్పరబోతు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నేరచరిత్ర లేనివారిపై బైండోవర్ కేసులా?



డీఎస్పీకి వినతిపత్రమిస్తున్న అయ్యలు

విజయనగరం క్రైం, జనవరి 20: ఎటువంటి నేర చరిత్ర లేని జన సైనికులపై ఎవరో గిట్టని వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బైండోవర్ కేసు నమోదు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవా లని జనసేన నాయకులు గురాన అయ్యలు కోరారు. శనివారం విజయనగరం డీఎస్పీ గోవిందరావును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత వ్యక్తులు లేని సమయంలో ఇళ్లకు వెళ్లి నోటీసులు జారీ చేసి కుటుంబ సభ్యులను భయాందోళనకు గురి చేస్తున్నారన్నారు. డీఎస్పీని కలిసిన వారిలో జనసైనికులు భరత్, భార్గవ్ తదితరులు ఉన్నారు.

బకాయిలను విడుదల చేయండి



మాట్లాడుతున్న రాష్ట్ర నేత సదాశివరావు

బొబ్బిలి, జనవరి 20: ఉపాధ్యాయ, ఉద్యోగ, పింఛను దారులకు పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలన్నిటినీ ప్రభు త్వం వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ (1938) రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎ.సదాశివరావు డిమాండ్ చేశారు. స్థానిక సాయి నగర్‌లోని ప్రైవేటు పాఠశాలలో శనివారం మండల ఏపీటీఎఫ్ నేత శీర సన్యాసినాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సదాశివరావు మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు డి.ఈశ్వ రరావు మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేయాలన్నారు. తాను ఇచ్చిన హామీని జగన్ నిలబెట్టుకోకపోవడం అన్యాయమన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటరమణ, నేతలు ఎన్‌వీ పైడిరాజు, పి.ధనుంజ యరావు, ఆర్.కృష్ణ, ఎం.బలరాంనాయుడు, ఏవీ శ్రీనివాసరావు, సీహెచ్ రామారావు, దాసరి వెంకటనాయుడు, సుధాకర్, గోపాలకృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ముగడ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీధర్

బాడంగి, జనవరి 20: రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా మండలంలోని వివిధ పోలింగ్ కేంద్రాలను బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీధర్ శనివారం పరిశీలించారు. ముగడ, కోడూరు, వాడాడ, పినపెంకి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ పిన్నవలస, రామచంద్రాపురం గ్రామాలలో టీడీపీ, జనసేన, వైసీపీలకు చెందిన 31 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జయంతి, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు శోభాయాత్రలో పాల్గొనాలి

విజయనగరం రూరల్: ఆయోధ్యలో ఈ నెల 22న జరిగే శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా జిల్లాలో రామశోభాయాత్ర నిర్వహిస్తున్నట్టు కమిటీ నిర్వహకులు బర్ల రామారావు తెలిపారు. అదే రోజు రామభద్రపురం నుంచి రామతీర్థం వరకూ మూడు దశలుగా ఈ యాత్ర నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో శోభాయాత్ర షెడ్యూల్‌ని ప్రకటించారు. రామభద్రపురం అయ్యప్పపీఠం గురుస్వామి, శివస్వామి ఆధ్వర్యంలో 600 మంది భక్తులతో ఈ శోభాయాత్ర ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. రామభద్రపురం నుంచి ఆరికతోట, విజయనగరం, రామతీర్థంలో మూడు దశలుగా నిర్వహిస్తున్నామన్నారు. యాత్రలో పాల్గొనే భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రామతీర్థం సేవా పరిషత్ వ్యవస్థాపకులు ప్రసాద్ మాట్లాడుతూ, పలు ధార్మిక సంఘాలు సహకారంతో కోట నుంచి మూడు లాంతర్లు మీదుగా పూల్‌బాగ్ అయ్యప్పస్వామి ఆలయం వరకూ నిర్వహిస్తామన్నారు. నవ్యాంధ్ర భద్రాద్రి రామతీర్థం చారిత్రాక నేపథ్యం ఉండడంతో ఈ కార్యక్రమం భారీ ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. శోభాయాత్ర అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. దాట్ల చిట్టిరాజు, ఎన్ వేణుగోపాల్, లక్ష్మణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● నగరంలోని కంటోన్మెంట్‌లోని ఆర్టీసీ కాలనీలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఆదివారం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్టు ఆర్టీసీ కాలనీ నిర్వహక ప్రతినిధులు తెలిపారు. దివ్య విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా యావత్తు భారతదేశంలోని రామభక్తులు హిందూ ధర్మ సమాజం ప్రజలు ఎక్కడిక్కడ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే కఠినశిక్షలు

● సీనియర్ సివిల్ న్యాయాధికారి బాబు



మాట్లాడుతున్న బాబు

రాజాం రూరల్: మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠినశిక్షలు తప్పవని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.బాబు హెచ్చరించారు. శనివారం రాజాం మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో సచివాలయాల సిబ్బందితో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఉచిత న్యాయ సహాయం, స్త్రీల హక్కులు, బాధ్యతలను జూనియర్ సివిల్ న్యాయాధికారి కృష్ణ సాయితేజ వివరించారు. కార్యక్రమంలో రాజాం ఎంపీడీవో బాసూరు శంకరరావు, ఏఎస్ఐ లక్ష్మునాయుడు, న్యాయవాదులు విజయ్‌కుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు గవర్నర్‌కు ఆహ్వానం ఏదీ?



మాట్లాడుతున్న సంతోష్

విజయనగరం దాసన్నపేట, జనవరి 20: విజయవాడలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను పిలవకపోవడంపై దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి రేగేటి సంతోష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ ప్రథమ పౌరురాలి హోదాలో ఉన్న గిరిజన బిడ్డతో విగ్రహావిష్కరణ చేయించి ఉంటే బాగుండేదని అన్నారు. సంఘ అధ్యక్షుడు గోక రమేష్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి దళితులు, గిరిజనులు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు డాక్టర్ అంబేడ్కర్ అశోక్, పొడుగు రామకృష్ణ, శ్రీను, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చుక్కమాంబ తీర్థం



కోలాటం ఆడుతున్న మహిళా

వేపాడ, జనవరి 20: అరిగిపాలెం-సోంపురం గ్రామాల ప్రజల ఆరాధ్యదేవత చుక్కమాంబ తీర్థమహోత్సవం శనివారం వైభవోపేతంగా జరిగింది. రెండు గ్రామాల ప్రజలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం ఆకట్టుకుంది. ఆదివారం కూడా ఉత్సవం కొనసాగుతుందని తెలిపారు.

అరకు బహిరంగ సభకు కొత్తవలస నాయకులు



సమావేశానికి వెళ్లడానికి సిద్ధంగా ఉన్న నాయకులు, కార్యకర్తలు

కొత్తవలస, జనవరి 20: అరుకు పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి దుంబ్రిగుడ మండలంలోని సంతబయిలు వద్ద తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నిర్వ హించిన 'రా.. కదలిరా' బహిరంగ సభకు కొత్తవలస నుంచి 200 కార్లలో శనివారం తరలి వెళ్లారు. శృంగవరపుకోట నియోజకవర్గ ఇన్‌చార్జి లలితకుమారి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు.

రేపటి నుంచి మహాసామ్రాజ్య పట్టాభిషేకం

విజయనగరం రూరల్: నగరంలోని రింగురోడ్డు కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 22 నుంచి మే నెల 14 వరకూ మహాసామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహిస్తున్నట్టు శ్రీనివాస సేవా సంఘం ప్రతిని ధులు సంపత్‌కుమారు ఆచార్యులు, చెరుకూరి శ్రీధర్ చెప్పారు. శనివారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, 22న విశ్వక్సేన పూజ, రుత్విక్ వరుణలతో ప్రారంభమౌ తుందని పేర్కొన్నారు. గోపూజా, శోభాయాత్ర, సుదర్శన యాగం ఉంటుందన్నారు. భక్తులు పాల్గొని విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు.

సరుకుల కోసం లబ్ధిదారుల ఆందోళన



నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

రాజాం: రేషన్ సరుకులు అందకపోవడంతో పురపాలక సంఘం పరిధిలోని ఆశపువీధికి చెందిన లబ్ధిదారులకు శనివారం ఆందోళన చేపట్టారు. ప్రతినెలా 15లోగా సరుకులు ఎండీఎం నిర్వాహకులు అందజేసేవారు. ఈనెల 20వ తేదీ వచ్చినా సరుకులు నిర్వాహకుడు అందజేయ లేదు. ప్రభుత్వం మాత్రం సర్వర్ సమస్య వల్ల 18వ తేదీ వరకు సరుకులు అందజేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇంతలో రేషన్ పంపిణీ చేయడానికి సర్వర్ కూడా నిలిపి వేశారు. ఇక్కడ ఆశపువీధిలో లబ్ధిదారులకు సరుకులు అందజేయలేదు.దీంతో శనివారం ఈ వీధికి చెందిన అన సూయ చిన్నమ్మడు, రాంబాబు, అప్పలనరసమ్మ, తదితరులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి నిరసన తెలిపారు. కాగా ఎండీయూ నిర్వాహకుడు మద్యం మత్తులో ఉండడంతో 50 కుటుంబాలకు సరుకులు పంపిణీ చేయలేదని, ఎన్నిసార్లు ఫోన్‌చేసినా ఎత్తడంలేదని సంబంధిత డీలర్‌ను ఇంటికి పంపించి ప్రస్తుతం సరుకులు మాన్యు వల్‌గా అందించాలని ఆదేశించామని సీఎస్‌డీటీ చిరంజీవి ఆంధ్రజ్యోతికి తెలిపారు. కొన్ని కుటుంబాలకు సరుకులు అందజేశామని చెప్పారు. ప్రస్తుతం సర్వర్ నిలిపివేయడంతో వచ్చే నెల పంపిణీలో ఈనెల సరుకులు సర్దుబాటు చేస్తామన్నారు.

లే అవుట్‌లో అక్రమ రోడ్డు

● వైసీపీ నేత స్థలం కావడంతో సర్వేతో సరి

● ఇంకా కనిపించని చర్యలు

శృంగవరపుకోట రూరల్: ముషిడిపల్లి పంచాయతీ పరిధిలో వైసీపీ బడా నేతకు చెందిన భారీ లే అవుట్‌కు వేసిన రోడ్డు వివాదం మొదలై ఏడాది గడిచింది. దీనిపై జిల్లాలో గతంలో పనిచేసిన కలెక్టర్‌తో పాటు ప్రస్తుత కలెక్టర్‌కు, డీపీవోలకు స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. కదలిక మాత్రం లేదు. కొద్ది రోజుల క్రితం జిల్లా సర్వే అధికారుల ఆధ్వర్యంలో మండల సర్వేయర్, వీఆర్‌వో, సచివాలయ సర్వేయర్ లేఅవుట్‌ను పరిశీలించారు. తరువాత ఈ లేవుట్‌కు వేసిన 60 అడుగుల రోడ్డులో ఒక ఎకరా రెండు సెంట్ల డీపట్టా భూమితో పాటు ఆరుసెంట్ల చెరువు స్థలం ఆక్రమణకు గురైనట్టు గుర్తించారు. రోడ్డు మధ్యలో ఒక సర్వే రాయి పాతడంతో పాటు చుట్టూ మార్కింగ్ వేశారు. దీనిపై మండల సర్వేయర్ వెంకటరావును వివరణ కోరగా గతంలో ఏడీ త్రివిక్రమరావు వచ్చారని... సర్వేరాళ్లు పాతామని... దానిపై తనకు స్పష్టత లేదన్నారు. వీఆర్‌వో సూరిబాబును అడగాలని తెలిపారు. దీనిపై గ్రామ వీఆర్‌వో సూరిబాబు వివరణ కోరగా రాళ్లు పాతి.. మార్కింగ్ వేశామని చెప్పారు. మిగతా వివరాలు సచివాలయ సర్వేయర్‌ను అడగాలని అన్నారు. సచివాలయ సర్వేయర్‌ను వివరణ కోరగా భూసర్వేలో భాగంగా రాళ్లు పాతామని, డీపట్టా భూమి, చెరువు కొంతమేర ఆక్రమణకు గురైనట్టు తెలిపారు. అధికార పార్టీ నేత లేఅవుట్‌కు పంచాయతీ తీర్మానం లేకుండా తప్పుడు పత్రాలు సృష్టించి రోడ్లు వేశారని... దీనిపై విచారణ చేయాలని సర్పంచ్ సోలుబొంగు దారప్ప గతంలో కలెక్టర్, డీపీవోలను కలిసి ఫిర్యాదు చేయడంతో దీనిపై విచారణ చేపట్టారు.





ఆక్రమణ జరిగిన ప్రాంతంలో మార్క్ చేసిన దృశ్యం, రోడ్డుకు మధ్యలో సర్వే రాయి పాతిన అధికారులు

అత్యాచారం, కులదూషణ కేసులో పదేళ్ల జైలు

బెలగాం, జనవరి 20: అత్యాచారం, కులం పేరుతో దూషించిన కేసులో నిందితుడికి 10 సంవత్సరాల జైలు శిక్ష, పది వేలు జరిమానా విజయనగరం కోర్టు విధించిందని ఎస్పీ విక్రాంత్ పాటిల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం మండలం ఓ గ్రామానికి చెందిన బాధితురాలు అదే గ్రామానికి చెందిన పిరిడి పోలి అనే వ్యక్తి తనను నమ్మించి మోసం చేశాడని, నిలదీస్తే కులం పేరుతో దూషించాడని 2019లో పార్వతీపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సదరు బాధితురాలికి ఓ వ్యక్తితో వివాహం కాగా ఆడపిల్లకు జన్మనిచ్చింది. కొన్ని సంవత్సరాల తర్వాత భర్తతో విభేదాలు రావడంతో తల్లితండ్రుల ఇంట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో గంగాపురం గ్రామానికి చెందిన పిరిడి పోలి అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. పిరిడి పోలి పెళ్లి చేసుకుంటానంటే నమ్మి మగబిడ్డకు జన్మనిచ్చింది. పెళ్లి చేసుకోవాలని బాధితురాలు అడగ్గా తక్కువ కులానికి చెందినదానివంటూ కులం పేరుతో దూషించి బెదిరింపులకు పాల్పడినట్లు తెలిపింది. ఆమె ఫిర్యాదుతో దీనిపై కేసు నమోదవడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టి విచారించారు. నేరం రుజువు కావడంతో నిందితుడు పిరిడి పోలికి 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ విజయనగరం కోర్టు తీర్పు ఇచ్చిందని ఎస్పీ ఓ ప్రకటనలో తెలిపారు.

ఎనిమిది మంది పేకాటరాయుళ్లపై కేసు

రేగిడి: మండలంలోని బూరాడలో శనివారం పోలీసులు పేకాటశిబిరంపై నిర్వహించిన దాడిలో ఎనిమిది మంది పట్టుబడగా, వీరి వద్దనుంచి రూ.6,970 సీజ్‌చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఎన్నికల విధుల్లో బాగంగా నిర్వహించిన దాడుల్లో ఎనిమిది మంది పేకాటరాయుళ్ల పట్టుబడగా వీరిపై పిటి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

40 మద్యం సీసాలు సీజ్

రేగిడి: మండలంలోని అడవరంలో అనధికార బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి నుంచి శనివారం 40 మద్యం సీసాలు పట్టుకుని సీజ్‌చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపా రు. ఎన్నికల విధుల్లో భాగంగా నిర్వహించిన సోదాల్లో నిందితుడిని పట్టుకుని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు.

కేజీహెచ్‌లో గిరిజనులను ఆదుకోండి

శృంగవరపుకోట రూరల్, జనవరి 20: విశాఖపట్నం కేజీహెచ్‌లో గిరిజనులు పడుతున్న కష్టాలను తీర్చాలని మండల గిరిజన సంఘ నేతలు శనివారం కోరారు. నేతలు గౌరీష్, శివ, రామన్న, అరుణ్ కుమార్, జోషి, రాము, సన్యాసిరావు, గంగులు మాట్లాడుతూ గాదెల్లోవా గ్రామానికి చెందిన బూరి రాజేష్ బోన్ క్యాన్సర్‌తో కేజీహెచ్‌లో ఉన్న భవానీవార్డులో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. వైద్య పరీక్షలు బయట చేసుకోవాలని.. మందులు కొనుక్కోవాలని చెప్పడంతో ఆ కుటుంబం పడుతున్న అవస్థలు వర్ణనాతీతం అన్నారు. గత ప్రభుత్వంలో విజయనగరం జిల్లా గిరిజనులు కేజీహెచ్‌లో చికిత్స చేయించుకుంటే ఆ డబ్బులను ఐటీడీఏ సెల్ భరించేదని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. వెంటనే రాజేష్ కుటుంబానికి పూర్తి స్థాయిలో వైద్యసేవలను ప్రభుత్వం అందించాలని కోరారు. లేని పక్షంలో గిరిజన సంఘం పోరాటం చేస్తుందన్నారు.

భారీగా మద్యం సీసాల స్వాధీనం



మద్యం సీసాలతో సెబ్ అధికారులు

విజయనగరం క్రైం, జనవరి 20: జిల్లాలో శనివారం ఏఈఎస్ శైలాజా రాణి ఆధ్వర్యంలో ఇంటిలిజెన్స్, సెబ్ అధికారులు భారీగా మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. భోగాపురం సెబ్ స్టేషన్ పరిధిలోని తిప్పలవలసలో 594 మద్యం సీసా లు స్వాధీనం చేసుకున్నారు. గుర్ల మండలం పాలవలసలో ఓ వ్యక్తి నుంచి 150 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో భోగాపురం సెబ్ ఇన్‌స్పె క్టర్ ఎంఆర్‌వీ అప్పారావు, ఇంటిలిజెన్స్ సీఐ బి.లలిత తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

● స్వల్ప గాయాలతో బయటపడిన భార్యా పిల్లలు

దేవరాపల్లి, జనవరి 20 : అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలంలోని కాశీపురం సచివాలయం సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్ర గాయాలకు గురై కేజీహెచ్‌లో చావుబతుకుల మధ్య కొట్టిమిట్టాడుతున్నాడు. ఇందుకు సంబంధించి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి. విజయనగరం జిల్లా వేపాడ మండలం వావిలపాడుకు చెందిన భూమిరెడ్డి శంకరరావు శుక్రవారం దేవరాపల్లి మండలం కలిగొట్లలో జరిగిన తీర్థానికి తన చెల్లెలు ఇంటికి భార్య, పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. రాత్రి కాశీపురం సచివాలయం సమీపానికి చేరగా మరో ద్విచక్ర వాహనం వచ్చి ఢీకొంది. దీంతో హెల్మెట్ ధరించి ఉన్నప్పటికీ శంకరరావు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. కాగా, అతని భార్యా పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ డి.నాగేంద్ర తెలిపారు.

ముగిసిన 'ఆడుదాం ఆంధ్ర'

వేపాడ: మండలంలోని వావిలపాగు, కొండగంగుబూడి గ్రామ సచివా లయాల పరిదిలో గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. చివరి రోజైన శనివారం వావిలపాడు కేజీపూడి జట్ల మధ్య మండల స్థాయి పోటీలను నిర్వహించగా ఈ పోటీలలో వావిలపాడు జట్టు విజేతగా నిలిచి, నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ తెలిపారు.

ఐఐఎస్ఎఫ్‌లో సత్తాచాటిన కంచరాం విద్యార్థులు



ఇంటర్నేషనల్ ఎక్స్‌పోలో కంచరాం విద్యార్థులు

రాజాం రూరల్: కంచరాం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈనెల 17 నుంచి 20 వరకూ హర్యానాలోని ఫరీదాబాద్‌లో కేంద్ర శాస్త్ర శాంకేతికశాఖ, బయోటెక్నాలజీ డిపార్ట్‌మెంట్, కేంద్ర అంతరిక్ష పరిశోధనశాఖ, విజ్ఞానభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియా ఇంటర్నేషనల్ ఫెస్టివల్‌లో(ఐఐఎస్ఎఫ్) సత్తాచాటారు. ఈ మేరకు వారు తయారుచేసిన ప్రాజెక్టులను ఆహూతులకు వివరించారు. టీచర్‌గైడ్ పందూరు వేణుగోపాల్ సారథ్యంలో తొమ్మిదోతరగతి విద్యార్థులు పి.సౌజన్య, పి.శిరీష, పి.సత్యవతి, పి.చరణ్, బి.దినేష్ మైక్రోస్కోప్ (ఫోల్డ్‌స్కోప్) సొంతంగా తయారుచేసి ఫెర్న్‌రైజోం ఫోల్డ్‌స్కోప్ ద్వారా పరిశీలించవచ్చని మెగా ఎక్స్‌పోలో తెలియజేశారు. ఇస్రో, సీఐఎస్ఆర్, విజ్ఞాన భారతి వంటి జాతీయ సంస్థలు ప్రదర్శించిన మెగా ఎక్స్‌పోలను పరిశీలిం చారు. కాంతి పరావర్తనం, వక్రీభవనం, విక్షేపణం, సంపూ ర్ణాంతార పరావర్తనం వంటి ధర్మాలను సమాం తర కాంతి కిరణాల ఉత్పత్తి పరికరం ద్వారా ఎక్స్‌పోలో పాల్గొన్న ఇతర రాష్ట్రాల విద్యార్థులకు ప్రయోగపూర్వకంగా వివరించారు. కాగా శనివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో హర్యానా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ విద్యార్థులను అభినందించారు.

ప్రేమికుల ఆత్మహత్య

గరుగుబిల్లి: తాను ప్రేమించిన అమ్మాయికి వేరే వ్యక్తితో పెళ్లి నిశ్చయించారని మనస్తాపంతో ఓ యువకుడు రైలు కింద పడి మృతిచెందగా, ప్రేమికుడు మృతి చెందాడని విషయం తెలుసుకున్న యువతి నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై ట్రైనీ డీఎస్పీ మహమ్మదీ అజీజ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం మండలం చినమరికి గ్రామానికి చెందిన వానపల్లి శ్రావణకుమార్ (26), కొమరాడకు చెందిన వారణాసి పద్మజ(24) గత కొంతకాలం గా ప్రేమించు కుంటున్నారు. శ్రావణ్ ఆంధ్రా యూనివర్సిటీ(విశాఖ)లో పీజీ చదువుతున్నాడు. ఇటీవల సంక్రాంతి సెలవులకు గ్రామానికి వచ్చిన శ్రావణ్‌కు.. పద్మజకు వేరే వ్యక్తితో పెళ్లి నిశ్చయం అయిందని తెలిసింది. దీంతో ఏమీ చేయలేని స్థితిలో శుక్రవారం పార్వతీపురం సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పద్మజ.. ఆదేరోజు మధ్యాహ్నం కొమరాడ ప్రాంతంలో నదిలో దూకేసింది. గాలింపు చర్యలు చేపట్టగా శనివారం తోటపల్లి ప్రాజెక్టు వద్ద పద్మజ మృతదేహం లభ్యమయ్యింది. మృతురాలి తండ్రి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రైనీ డీఎస్పీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కల్పనాకుమారి

సీతంపేట: గణతంత్రదినోత్సవం ఘనంగా నిర్వహించాలని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి కోరారు. శనివారం సీతంపేట గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై ఐటీడీఏలోని అన్ని శాఖల సెక్టోరియల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. వేడుకలకు హాజరయ్యే వారికి తాగునీరు సదుపాయం కల్పించాలని, దేశభక్తి ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, ఐటీడీఏ ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉత్తమ ఉద్యోగులకు ప్రదానంచేసే ప్రశంసాఅవార్డుల ఎంపికను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో రోసిరెడ్డి, ఈఈ సింహాచలం, జీసీసీ డీఎం సంధ్యారాణి, పీఏవో హరికృష్ణ, పీహెచ్‌వో గణేష్, ఏవో విజయరాణి, డిప్యూటీ ఈవో లిల్లీరాణి, ఏటీడబ్ల్యువో మంగవేణి, డిప్యూటీ ఎస్‌వో అప్పారావు, స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకబ్ దయానంద్ పాల్గొన్నారు.

తెలగలను బీసీల్లో చేర్చాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెలగ సంఘ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: తెలగలను బీసీల్లో చేర్చాలని గుమ్మలక్ష్మీపురం తెలగ సంఘ నాయకులు తహసీల్దార్ రాములమ్మకు వినతిపత్రం సమర్పించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయంగా వెనుకబడి ఉన్న తమను బీసీల్లో చేర్చాలని కోరారు.కార్యక్రమంలో తెలగ సంఘ నాయకులు యర్నాకుల నాగరాజు, పైడి జగదీశ్వరరావు, అత్తిలి శ్రీనివాసరావు, ఎం.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అరకు తరలివెళ్లిన టీడీపీ ప్రతినిధులు



అరకు బహిరంగ సభకు తరలివెళ్లిన టీడీపీ నాయకులు

గరుగుబిల్లి: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు అరకులో శనివారం నిర్వహించిన రా.. కదలిరా కార్యక్రమానికి అధిక సంఖ్యలో పార్టీ ప్రతినిధులు తరలివెళ్లారు. టీడీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో ఐదు మండలాలకు చెందిన పార్టీ ప్రతినిధులు, కార్యకర్తలు వాహనాలపై పయనమయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమన్నారను. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డొంకాడ రామకృష్ణ, వెంపటాపు భారతి, అంబటి తవిటినాయుడు, వై.శ్రీనివాసరావు, వి.దివాకర్, రామ్‌ప్రసాద్, బి.జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

కులగణనకు సర్వర్ సమస్య

గరుగుబిల్లి: గ్రామాల్లో నిర్వహిస్తున్న కులగణన సర్వేకు సర్వర్ సమస్య ఏర్పడింది. సర్వే శుక్రవారం నుంచి ప్రారంభం కాగా కొంతమేర సర్వే నిర్వహించారు. అయితే ఇందుకు కొంతమేర తప్పిదాలు నెలకొనడంతో సర్వే సిబ్బంది మార్పులకు చర్యలుచేపడుతున్నారు.ఇదిలాఉండగా శనివారం పలుగ్రామాల్లో సర్వేకు సరైన సిగ్నల్స్‌లేక సిబ్బంది ఇబ్బందులకు గురయ్యారు. ఆయా గ్రామాల్లో నిర్వ హిస్తున్న సర్వేను ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్డీ గోపాలరావు, ప్రత్యేకాధికారి ప్రభాకర్ పరిశీలించి నిర్ధేశించిన సమయంలోగా పూర్తిచేయాలని ఆదేశించారు.

తప్పిపోయిన పిల్లల ఆచూకీకి చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న దామోధరరావు

బెలగాం: తప్పిపోయిన పిల్లల ఆచూకీ కోసం చర్యలు చేపట్టాలని రెండో అద నపు న్యాయాధికారి ఎస్.దామోదరరావు అన్నారు. పార్వతీపురం మండలం న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో పోలీసు అధికారులతో కోర్టు ప్రాంగణంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తప్పిపోయి న పిల్లలు, మహిళలపై ప్రత్యేక దృష్టి సారించి విచారణ చేయాలన్నారు. అలాగే సైబర్ క్రైంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.రమేష్, శిక్షణ డీఎస్పీ ఎండీ అజీజ్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించాలి: పీవో



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో విష్ణుచరణ్

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు ముందుగా సందర్శించాలని పార్వతీపురం ఐటీడీఏ పీవో, సాలూరు నియోజకవర్గం ఓటరు నమోదు అధికారి సి.విష్ణుచరణ్ అన్నారు. ఎన్నికల నిర్వహణపై శనివారం ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో సంబంధిత తహసీల్దార్లు, సెక్టార్ అధికారులు, పోలీసు అధికారులతో ఆయన సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల అధికారులు విధిగా పోలింగ్ కేంద్రాలను సందర్శించి, అక్కడి మౌలిక సదుపాయాలు తనిఖీ చేయాలని ఆదేశించారు. కనీస వసతులైన తాగునీరు, విద్యుత్, ర్యాంప్, మరుగుదొడ్లు తదితర వసతులు ఉండాలన్నారు.

జనసేన ఉత్తరాంధ్ర కోకన్వీనర్‌గా సత్తిబాబు

పాలకొండ: పాలకొండ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి గర్భాన సత్తిబాబుకు ఎన్నికల కార్యక్రమ నిర్వహణ జోనల్ ఉత్తరాంధ్ర కోకన్వీనర్‌గా నియమించారు. ఈమేరకు అధిష్ఠానం నుంచి శనివారం ప్రకటన వెలువడింది. దీంతో సత్తిబాబుకు పాలకొండ నియోజకవర్గంలోని పలువురు జనసేన నాయకులు అభినందించారు.







గరుగుబిల్లి: రాస్తారోకో చేస్తున్న అంగన్‌వాడీలు సాలూరు రూరల్:పాచిపెంటలో నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు సీతంపేట: మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలి

- మానవహారాలు.. రాస్తారోకోలతో నిరసనలు
- 40వ రోజుకు చేరిన సమ్మె

అంగన్‌వాడీల సమ్మె విషయంలో ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలని పలు ప్రజా సంఘాలు డిమాండ్‌చేశాయి. శనివారం సమ్మె 40వ రోజుకు చేరగా జిల్లాలో పలుచోట్ల రాస్తారోకోలు, మానవహారాలు నిర్వహించి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘంతో పాటు పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీలు నిర్వహించారు. పలుచోట్ల కోటి సంతకాల కార్యక్రమం చేపట్టారు.

● **సీతంపేట:** తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు సీతంపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద ధర్నా, రాస్తారోకో, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీలకు స్వయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. తమపై ఎస్మా ప్రయోగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

●**గరుగుబిల్లి:** అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారమయ్యేంతవరకూ పోరాటం కొనసాగుతుందని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు తెలిపారు. గరుగుబిల్లి మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీవీ రమణ మాట్లాడుతూ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం నిరసన 40వ రోజుకు చేరుకున్నా, ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమని ఆరోపించారు. తక్షణమే అంగన్‌వాడీలపై నిర్బంధాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీల ప్రతినిధులు గౌరమ్మ, సావిత్రి, పద్మ, కృష్ణవేణితో పాటు బాబురావులు పాల్గొన్నారు.

●**సాలూరు రూరల్:** అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నేత కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో పాచిపెంటలో ప్రజాసంఘాలు రాస్తారోకో చేశాయి. ఈసందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ 40 రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా బెదరింపులకు దిగడం దారుణమన్నారు. తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుని, అంగన్‌వాడీలకు న్యాయంచేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు పోలిరాజు, గౌరునాయుడు పాల్గొన్నారు.

వెలుగు ఏపీఎంల సమ్మె నోటీసు



డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న ఏపీఎంలు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: వెలుగు ఏపీఎంలు సమ్మె నోటీసును శనివారం డీఆర్డీఏ పీడీ పెద్దింటి కిరణ్‌కుమార్‌కు అందజేశారు. తాము రాత్రి, పగలు కష్టపడి విధులు నిర్వహిస్తున్నామని సమస్యలు పరిష్కరించడం లేదని తెలిపారు. తక్షణమే సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవా లని సమ్మె నోటీసును ఇస్తున్నట్లు ఏపీఎంలతో పాటు పలువురు వెలుగు సిబ్బంది చెప్పారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్షలు



సాలూరు: మునిసిపల్ పాఠశాల వద్ద పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థులు

పాలకొండ: పాలకొండలో శనివారం నవోదయ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 312 మందికి గాను 57మంది గైర్హాజరయ్యారని సెంటర్ సూపరింటెండెంట్ ఎం.సూర్య నారాయణ, సీఎల్‌వో జి.రవిప్రసాద్ తెలిపారు. జడ్పీ బాలికోన్నత పాఠశాలలో 279 మందికి 42 మంది గైర్హాజరయ్యారన్నారని సెంటర్ సూపరింటెండెంట్ రేణుకాదేవి, సీఏఎల్‌వో రవి తెలిపారు. ఈ రెండు కేంద్రాలకు అబ్జర్వర్‌గా ఎంఈవో కె.స్వామిబాబు వ్యవహరించారు.

● **సాలూరు:** పట్టణంలో శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షకు 453 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో రాజ్‌కుమార్ తెలిపారు. వేద సమాజం సంస్కృత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, మున్సిపల్ డబ్బివీధిలో ఉన్న పాఠశాలల్లో పరీక్ష నిర్వహించారు. 548 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 95 మంది విద్యార్థులు గైర్హాజరయినట్టు ఆయన తెలిపారు.

పాలనపై అవగాహన అవసరం

- గరుగుబిల్లి ఎంపీడీవో పైడితల్లి, ఈవోపీఆర్‌డీ గోపాలరావు



వార్డు సభ్యులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో పైడితల్లి

గరుగుబిల్లి: పంచాయతీ పాలనపై అవగాహన అవసరమని ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు అన్నారు. శనివారం స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో 25 పంచాయతీలకు చెందిన పంచాయతీ వార్డు సభ్యులకు ప్రణాళికల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పనకు విధిగా ప్రణాళికలు ఎంతగానో అవసరమన్నారు. ప్రజలతో చర్చించి, ప్రత్యేక గ్రామసభ నిర్వహించి ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన కల్పించేందుకు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్‌లో భాగంగా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి ఎస్.అర్జునరావు, రిసోర్స్‌పర్సన్ తిరుపతి, భాస్కరరావు, సర్పంచ్ కె.ఇందుమతితో పాటు కార్యదర్శులు, వార్డు మెంబర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కూలిన మినీ రక్షితనీటి పథకం ట్యాంకు



కూలిన మినీ మంచినీటి పథకం ట్యాంకు, దిమ్మ

జియ్యమ్మవలస: చినమేరంగి గ్రామ దళితవాడలో సర్పంచ్ సొంత నిధులతో ఏర్పాటుచేసిన మినీ రక్షిత నీటి పథకం ట్యాంకు శనివారం ఉదయం ఒక్కసారిగా కూలిపోయింది. ఆ సమయంలో తాగునీరు కోసం ఇద్దరు మహిళలు, ఒక వ్యక్తి వచ్చి అక్కడే ఉన్నారు. అయితే వారు ఉన్న చోటుకు అవతలి వైపు ట్యాంకు దిమ్మతో సహా కూలిపోవడంతో ఏ ప్రమాదం జరగలేదు. ఒకవేళ ట్యాంకు ఉత్తరం వైపు కూలిపోతే పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టేది. అదే జరిగితే విద్యుత్ వైర్లు తెగిపడి మరింత ప్రమాదం జరిగేది. గతంలో అక్కడ చేతిపంపు ఉండేది. చేతిపంపునకు మోటారు బిగించి, దళితవాడకు నీరందించేవారు. దళితుల కోరిక మేరకు గ్రామ సర్పంచ్ అల్లు రమణమ్మ ప్రస్తుతం తన సొంత డబ్బులతో ట్యాంకు దిమ్మ, దానిపై 5వేల లీటర్ల సామర్థ్యంగల ప్లాస్టిక్ ట్యాంకు ఏర్పాటుచేశారు. ఇది ఏర్పాటుచేసి, 15 రోజులు కాకముందే కూలిపోయింది. ట్యాంకు దిమ్మ నిర్మాణంలో నాణ్యతా లోపం ఉండటంతో ఈ ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. అయితే ఈ ట్యాంకును తొలుత పంచాయతీ నిధులతో నిర్మించే ప్రయత్నం చేశారు. కానీ ఇంకా ఎటువంటి ఎస్టిమేట్లు వేయలేదని పంచాయతీ కార్యదర్శి బి.రామకృష్ణ తెలిపారు.

లారీ డ్రైవర్ల నిరసన

గుర్ల: హిట్ అండ్ రన్ కేసుల విషయంలో ఇటీవల తీసుకొచ్చిన నిబంధనలు తక్షణమే మార్చాలని, ఈనిబంధనలు డ్రైవర్ల జీవితాలు నాశనం చేసేలా ఉన్నాయని శ్రీకనకదుర్గమ్మతల్లి లారీ డ్రైవర్లు, క్లీనర్ల యూనియన్ కార్యదర్శి పతివాడ సోమేష్ ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన హిట్ అండ్ రన్ కేసుల్లో తీసుకొచ్చిన నిబంధనలను వ్యతిరేకిస్తూ గుర్లలో శనివారం లారీడ్రైవర్లు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ముందుగా స్థానిక పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఎస్‌ఐ ఎస్.భాస్కరరావుకు వినతిపత్రం అందించారు. అనంతరం అక్కడి నుంచి పెట్రోల్ బంకు వరకు ర్యాలీ చేపట్టారు. ప్రమాదం జరిగితే 7 నుంచి 10 సంవత్సరాల జైలుశిక్ష విధిస్తూ రూ.7లక్షల వరకు జరిమానా విధించడం డ్రైవర్ల పాలిట శాపం గా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు బోడసింగి త్రినాథరావు, ఉపాధ్యక్షుడు పతివాడ సత్యనారాయణ, కార్య దర్శి పతివాడ సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొండవెలగాడ ఫీల్డ్ అసిస్టెంట్ రాజీనామా

నెల్లిమర్ల: వెలగాడ ఉపాధి హామీ పథకం ఫీల్డ్‌అసిస్టెంట్ జీనపాటి శ్రీనివాసరావు రాజీనామాచేశారు. రాజీనామాపత్రం పదిరోజుల కిందటే ఎంపీడీవోకు సమర్పించగా ఆ పత్రాన్ని ఆమోదంకోసం ఈ పథకం జిల్లా పీడీకి పంపించారు.కాగా బలవంతంగా ఆయనతో రాజీనామా చేయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా శ్రీనివాసరావు రాజీనామాపత్రం సమర్పించిన విషయం వాస్తవమేనని, ఆపత్రాన్ని పీడీకి పంపించామని ఎంపీడీవో రామారావు చెప్పారు.

మద్యం సీసాల స్వాధీనం

నెల్లిమర్ల: మండలంలోని రెండు గ్రామాల్లో అక్రమంగా మద్యం సీసాలను కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను ఎస్‌ఐ రామగణేష్ పట్టుకుని కేసులు నమోదు చేశారు. ఆ ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం రాత్రి గరికిపేటలో ఓ వ్యక్తిని 52 సీసాలతో అదుపులోకి తీసుకోగా, గుషిణి జంక్షన్‌లో శనివారం 24 మద్యం సీసాల తో మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు. ● **గుర్ల:** గుర్లలోని గూడెం జంక్షన్ వద్ద ఒక వ్యక్తి 26 మద్యం సీసాలను తరలిస్తుండగా గుర్ల పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వకపోతే ఎలా?

గంట్యాడ: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వకపోతే ఎలా అంటూ వివిధ గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు.. స్థానిక ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య ముందు మొర పెట్టుకున్నారు. శనివారం కొండతామరాపల్లి కూడలిలో కల్యాణ మండపంలో వైసీపీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయలేదని చెప్పారు. తక్షణమే నిధులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ విషయం మంత్రి ద్వారా సీఎం దృష్టికి తీసుకుని వెళ్తామని చెప్పారు.

రేపు రామతీర్థంలో శోభాయాత్ర

నెల్లిమర్ల: అయోధ్యలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం ఉదయం 8.30 గంటలకు నెల్లిమర్ల నుంచి ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని రామస్వామి దేవస్థానం వరకు వేలాది మంది భక్తులతో శోభా యాత్ర నిర్వహిస్తున్నట్టు రామతీర్థం సేవా సంఘం ప్రతినిధి సుదర్శనం విజయ్‌కుమార్ తెలిపారు. శ్రీరాముని దర్శనం అనంతరం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు.

చినశంబర పోలమాంబ జాతర లేనట్లే

- విరమించుకోవాలని గ్రామస్థుల నిర్ణయం

గరుగుబిల్లి: మరుపెంట గ్రామంలో నిర్వహిస్తున్న చినశంబర పోలమాంబ జాతరను నిర్వహించేందుకు పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ఇకపై శాశ్వతంగా విరమించుకోవాలగ్రామస్థులందరూ ఏకగ్రీవంగా నిర్ణయించారని ఎంపీపీ ఉరిటి రామారావు, సర్పంచ్ ఉరిటి నిర్మళ వెల్లడించారు. శనివారం వీరు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మక్కువ మండలం శంబర గ్రామంలో పోలమాంబ జాతర నిర్వహించిన తేదీల్లో మరుపెంట గ్రామంలో చినశంబర పోలమాంబ జాతర ప్రతి ఏడాది నిర్వహించడం జరుగుతూ ఉండేదన్నారు. అయితే కరోనా వచ్చినప్పటి నుంచి చినశంబర పోలమాంబ జాతరను నిర్వహించలేదన్నారు. ప్రస్తుతం గ్రామంలో పరిస్థితుల కారణంగా పండగను నిర్వహించేందుకు అనుకూలంగా లేకపోవడంతో పండుగను ఇకపై విరమించుకోవాలని గ్రామస్థులంతా నిర్ణయం తీసుకున్నామని ఎంపీపీ రామారావు, సర్పంచ్ నిర్మళ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని స్థానిక ఎస్‌ఐకి తెలియజేశామని తెలిపారు.

సారాతో ముగ్గురి అరెస్టు

సాలూరు రూరల్: ఒడిశా నుంచి సారా దిగుమతి చేస్తున్న ఇద్దరు మహిళలతో సహా ముగ్గురిని వేర్వేరు ఘటనల్లో అరెస్టు చేసినట్టు పాచిపెంట ఎస్‌ఐ పొదిలాపు నారాయణరావు చెప్పారు. ఆయన శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన తనిఖీల్లో 20 లీటర్ల సారా ప్యాకెట్లతో పారమ్మను, 25 లీటర్ల సారా ప్యాకెట్లతో ప్రియను అరెస్ట్ చేశామని తెలిపారు. పద్మాపురం వద్ద నిర్వహించిన తనిఖీల్లో 40 లీటర్ల సారా ప్యాకెట్లను బైకుపై అక్రమ రవాణా చేస్తున్న కన్నయ్యను అరెస్టు చేశామని చెప్పారు.

మూలకుచేరిన బండి.. రోడ్లపై చెత్త

- ఇదీ పాలకొండ గారమ్మకాలనీలో పరిస్థితి

పాలకొండ: నగరపంచాయతీలోని గారమ్మకాలనీలో చెత్త సేకరించే బండి మూలకుచేరడంతో రోడ్లపైనే చెత్త పేరుకుపోతోంది. వారంరోజులుగా ఇదే పరిస్థితి నెలకొన్నా సిబ్బంది పట్టించుకోవడంలేదని కాలనీవాసులు వాపోతున్నారు. తక్షణమేఇంటింటా చెత్తను సేకరించాలని కాలనీవాసులు నగరపంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావుకు వినతిపత్రంశనివారం అందజేశారు. వారంరోజులుగా చెత్త సేకరించకపోవడంతో అవస్థలుపడుతున్నామని వాపోతున్నారు. కాగా చెత్త సేకరించే బండి చక్రాలు పాడయ్యాయని శానిటరీ సెక్రటరీ తెలిపారు.



మూలకుచేరిన చెత్త సేకరణ బండి

మండలాలకు చేరిన సీబీఏ ప్రశ్నపత్రాలు

సాలూరు రూరల్: పాఠశాలల్లో ఈనెల 23 నుంచి నిర్వహించనున్న క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్ (సీబీఏ) నిర్వహణకుగాను జిల్లాలో మండల కేంద్రాలకు శనివారం ప్రశ్నపత్రాలు, ఓఎమ్మార్ షీట్లు చేరుకున్నాయి. ఈ పరీక్షలు జనవరి 2 నుంచి జరగాల్సి ఉండగా వివిధ కారణాల వల్ల 23కు వాయిదాపడ్డాయి. జవాబులను ఓఎమ్మార్ షీట్లపై విద్యార్థులు పెన్‌తో జవాబు సర్కిల్‌ను డార్క్ చేయాల్సిఉంటుంది. గతేడాది నుంచి ఈ విధానంలో సీబీఏ పరీక్షలను నిర్వహిస్తున్నారు. పార్వతీపురం మన్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 1,727 ఉన్నాయి. ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు సీబీఏ తరహాలో పరీక్షను నిర్వహించాల్సిఉంది. తొమ్మిది, పదితరగతులకు ఓఎమ్మార్ షీట్ లేకుండా పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ పరీక్షలు ఈనెల 23 నుంచి 29 వరకు జరగనున్నాయి.



పాచిపెంటలో ప్రశ్న పత్రాలు సిద్ధం చేస్తున్న సీఆర్పీలు